Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com

http://www.suryavastavam.in

బుధవారం | 26 జూన్ 2024 | తిరుపతి

సంపుటి 1 | సంచిక 22

పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



ఎం ఐ ఎం అధ్యక్షులు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఎంపీగా ప్రమాణ స్వీకారం

# దేశ చరిత్రలోనే తొలిసారి


- ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి
- స్పీకర్ పదవికి పోటీని పెట్టిన కాంగ్రెస్
- ఓంబిర్లాకు పోటీగా కొడికున్నల్ సురేశ్ నామినేషన్
- నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్

2లో



# మళ్లీ జన్మ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతా

## –కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



కుప్పం జూన్ 25 (సూర్య వాస్తవం) : మళ్లీ జన్మ అనేది ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. “నేను ఇక్కడకు వచ్చినా.. రాకున్నా నన్ను ఆదరించారు. ఇప్పటి వరకు నన్ను 8 సార్లు గెలిపించారు. కుప్పం ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. కుప్పం వ్యవహారాలు చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ నేతలకు అభినందనలు. మొన్నటి ఎన్నికల్లో వైకాపాను చిత్తుచిత్తుగా ఓడించారు. ఈ ఎన్నిక ద్వారా రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తిరగరాయబోతున్నాం.అహంకారంతో విర్రవీగితే.. ప్రజాస్వామ్యంలో వైకాపాకు పట్టిన గతే పడుతుందని ప్రజలు నిరూపించారు. నా రాజకీయాలకు కుప్పం నియోజకవర్గం ప్రయోగశాల. వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే కుప్పంను ఎంచుకున్నా. చిత్తూరు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. వచ్చే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటా. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తా. మొన్నటి ఎన్నికల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం. కేబినెట్‌లో 8మంది బీసీలకు అవకాశం కల్పించాం. వైకాపా పాలన పీడకల.. అలాంటిది ఎప్పుడూ చూడలేదు. వైకాపా ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలు అసహ్యించుకున్నారు. ఏ తప్పూ చేయకున్నా 30 మంది కార్యకర్తలను జైల్లో పెట్టారు. కుప్పం ప్రశాంతమైన స్థలం.. ఇక్కడ హింసకు చోటు లేదు. కుప్పంలో రౌడీయిజం చేసేవారికి అదే కడపటి రోజు.. జాగ్రత్త” అని చంద్రబాబు హెచ్చరించారు. ఐదేళ్లుగా కుప్పంలో ఎలాంటి అభివృద్ధీ లేదని.. అభివృద్ధి పనులు ఇవాళ్టి నుంచే ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. “ నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో తాగునీరు, డ్రైనేజీలు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం.

2లో







### రాహుల్‌గాంధీ ఎంపీగా ప్రమాణస్వీకారం ..

మంగళవారం కాంగ్రెస్ కీలకనేత, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ ప్రమాణం చేశారు. రాహుల్ గాంధీ ప్రమాణం చేయడానికి పిలిచిన సమయంలో ఇండియా కూటమి సభ్యులంతా బల్లలు చరిచి, భారత్ జోడో నినాదాలు వినిపించారు. రాహుల్ గాంధీ ప్రమాణం చేయడానికి ముందు కొద్దిసేపు చేత్తో భారత రాజ్యాంగం ప్రతిని పట్టుకున్నారు. ప్రమాణం పూర్తయిన తర్వాత జై రాజ్యాంగం అంటూ నినదించారు

# ప్రతిపక్ష హోదా ఇవ్వండి

## –స్పీకర్ అయ్యన్నకు జగన్ సంచలన లేఖ

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) :: ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి సంచలన లేఖ రాశారు. మంత్రుల తర్వాత తనతో ప్రమాణస్వీకారం అసెంబ్లీ పద్ధతులకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్టు ఉన్నారని జగన్ అన్నారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని, ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. పార్లమెంటులో కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ ఈ నిబంధన పాటించలేదన్నారు. అధికారకూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారని లేఖలో జగన్ పేర్కొన్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయటపడ్డాయని, ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితులు కనిపించడంలేదని అన్నారు. ప్రతిపక్ష హోదాతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ హోదాతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లేఖను పరిశీలించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని జగన్ అభ్యర్థించారు.

# బీసీ, ఆశ్రమ పాఠశాలల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

## –రాష్ట్ర మంత్రి ఎస్.సవిత



# గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎమ్ల సేవలు

## – రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) : రాష్ట్ర వ్యాప్తంగా నున్న 554 గిరిజన పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎమ్ ల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర గిరిజన మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. గిరిజన పాఠశాలల్లో అనారోగ్యం, పోషక ఆహార లోపం సమస్యలు తలెత్తకుండా, తద్వారా విద్యార్థుల మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించిన తదుపరి పబ్లిసిటీ సెల్లో పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజనుల సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఐ.టి.డి.ఏ.ల పరిధిలోని 554 గిరిజన పాఠశాలల్లో

6లో





# కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరందాలి – మంత్రి

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంట కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరు అందేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురు కాకూడదన్నారు. అన్నదాతకు మేలు జరిగేలా కాలువలు, డ్రైన్ల లో అవసరమైన ప్రక్షాళన పనులను యుద్ధ ప్రాతిపదికన పది రోజుల్లో మొదలు పెట్టేలా సమాయత్తం కావాలన్నారు. సచివాలయంలో మంగళవారం

3లో



# సంపాదకీయం

## సమాజాభివృద్ధిలో కీలకపాత్ర జర్నలిస్టుదే

- జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- జర్నలిస్టు పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలి
- రూ.10లక్షల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి.
- జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలి

ప్రత్యేక ప్రతినిధి సూర్య వాస్తవం: అనునిత్యం ప్రజల మధ్యలో ఉండి నిస్వార్థంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మార్గ నిర్దేశం చేసి రాష్ట్రంలోనీ ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడానికి కృషి చేస్తున్న అన్ని రంగాల జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలి అని సూర్య వాస్తవం పత్రిక ప్రత్యేక ప్రతినిధి ఎన్. ఆరిఫ్ అలీ అన్నారు. అర్హులైన జర్నలిస్టు అందరికీ మాస, పక్ష, వార పత్రికల సంపాదకులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడేషన్ మంజూరు చేయాలి. జర్నలిస్టులందరికీ రూ.10లక్షల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి. అలాగే జర్నలిస్టుల వెల్ఫేర్ కమిటీని, జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీని, తక్షణమే పునరుద్ధరించాలి. తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న అకాల మరణం పొందిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు అందిస్తున్న పెన్షన్ స్కీమ్‌ను రాష్ట్ర%శీ%లోనూ అమలు చేయాలి. 20 ఏళ్లకు పైగా జర్నలిస్టుగా పనిచేసిన వారికి రూ.10వేల చొప్పున పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసి జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని, తెలుగు రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి . జర్నలిస్టుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలి. ఈ పేర్కొన్న అంశాలు కొత్త ప్రభుత్వం దృష్టి సారిస్తే ఆచరణ సాధ్యమే. ఏది ఏమైనా ప్రభుత్వం పాత్రికేయులపై దయతలిచి న్యాయమైన కోరికలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని జర్నలిస్టుల కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.



ఎన్ . ఆరిఫ్ అలీ, ప్రత్యేక ప్రతినిధి
సూర్య వాస్తవం దినపత్రిక

## కొత్త లోక్‌సభలో ఎంపీల ప్రమాణ స్వీకారం



కొత్త లోక్‌సభలో తెలుగు ఎంపీల ప్రమాణ స్వీకారం ముగిసింది. కొందరు ఎంపీలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేయగా, మరికొందరు ఇంగ్లీష్, హిందీలో చేశారు. కానీ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన నినాదం లోక్‌సభలో దుమారం రేపింది.



దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ని హత్య చేసిన బాడీగార్డుల్లో ఒకరైన బీంట్ సింగ్ కుమారుడు సరబ్‌జీత్ సింగ్ ఖల్సా మంగళవారం నాడు లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.



మాజీ క్రికెటర్ యూసుఫ్ పటాన్ లోక్ సభ ఎంపీగా ప్రమాణం చేశారు. పశ్చిమ బెంగాల్ లోని బెర్హంపూర్ లోక్ సభ నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా యూసుఫ్ పఠాన్ ఎన్నికయ్యారు..



కాంగ్రెస్ ఎంపీ చరణ్ సింగ్ చన్నీ, బిజెపి ఎంపీ అపరాజీత సారంగి



లోక్సభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎంపీలుగా భార్యా, భర్తలు ప్రమాణస్వీకారం చేశారు. సమాజ్వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కన్నౌజ్ నుంచి ఆయన భార్య డింపుల్ యాదవ్ మెయిన్పురి నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. దీంతో 18వ లోక్సభలో వీరిద్దరూ ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్గా నిలిచారు...



లోక్సభ సభ్యురాలిగా తెలుగు నటి రచనా బెనర్జీ ప్రమాణస్వీకారం చేశారు. పశ్చిమ బెంగాల్లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి ఆమె తృణముల్ కాంగ్రెస్ తరుపున పోటీ చేసి గెలిచారు. రాజకీయాల్లోకి అరంగేట్రం తోనే విజయం సాధించారు. కాగా, తెలుగులో పలు హిట్ సినిమాల్లో రచన నటించి అందరికీ సుపరిచితురాలు అయ్యారు.



బిజెపి ఎంపీ సంబిత్ పాత్ర



తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గోపీనాథ్ లోక్‌సభలో మంగళవారం తెలుగు భాషలో ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగు కుటుంబానికి చెందిన గోపీనాథ్ తన పూర్వీకులు హొసూరులో స్థిరపడడంతో తెలుగునే మాతృభాషగా భావిస్తున్నారు. అక్కడి ప్రజల్లో తెలుగువారు గణనీయంగా ఉంటున్నందున వారితో సమస్యలు, పరిష్కారాల విషయంలో తెలుగులోనే మాట్లాడుతూ ఉంటారు. తమిళనాడులో ఉన్నందున తమిళ ప్రజలతో వారి భాషలోనే మాట్లాడుతారు.

## దేశ చరిత్రలోనే తొలిసారి.....

న్యూఢిల్లీ జూన్ 25 (సూర్య వాస్తవం) :దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేశ్ ప్రొటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఎ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం దప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఏ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల పక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది.18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు.స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది.

### మళ్లీ జన్మ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతా

మొదటి పేజీ తరువాయి

అన్ని గ్రామాలకు కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా మళ్లీ మినరల్ వాటర్ ఇస్తాం. అన్ని గ్రామాలు, పంట పొలాల వద్దకు రోడ్లు వేస్తాం. హంద్రీ-నీవా కాలువను ఇప్పుడే పరిశీలించా. కుప్పంలోని నాలుగు మండలాలను ఆదర్శపట్టణాలుగా అభివృద్ధి చేస్తాం. వీలైనంత తొందరలోనే కుప్పంకు విమానాశ్రయం వస్తుంది. స్థానిక ఉత్పత్తులను కుప్పం నుంచి ఎయిర్ కార్గో ద్వారా విదేశాలకు పంపిస్తాం.ఇంటికి రెండు ఆవులు ఇస్తే ఆరోజు నన్ను ఎగతాళి చేశారు. కుప్పంలో ప్రస్తుతం 4లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి... 10లక్షల లీటర్లకు చేరేలా చూస్తాం. పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమను మరింత ప్రోత్సహిస్తాం. తేనె ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు చేపడతాం. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తాం. ఏ కుటుంబంలోనూ పేదరికం ఉండకూడదన్నదే నా ఆశయం. కుప్పం బస్టాండ్, డిపో రూపురేఖలు మార్చి.. ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తాం. మల్లన్న, రాళ్లమణుగూరును మండలాలు చేస్తాం. కుప్పం భవిష్యత్‌లో రైల్వే జంక్షన్‌లా మారే అవకాశముంది. వి.కోట-పలమనేరు రోడ్డును నాలుగులేన్లుగా మార్చాలి. ఫోర్ లేన్ రోడ్డు వేస్తే బెంగళూరుకు గంటలోనే వెళ్లొచ్చు" అని చంద్రబాబు తెలిపారు.

## బీసీ, ఆశ్రమ పాఠశాలల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

### - రాష్ట్ర బీసీ,ఇడబ్ల్యుఎస్ సంక్షేమ,హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్ మంత్రి ఎస్.సవిత

అమరావతి, జూన్ 25 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో అసంపూర్తిగా నున్న బీసీ భవనాలు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ,ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన మరామ్మత్తులపై నివేదికను అందజేయాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర బీసీ,ఇడబ్ల్యుఎస్ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమావేశమై శాఖాపరంగా నిర్వహిస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు, శ్రీకాకుళం మరియు కర్నూలు జిల్లాల్లో బి.సి. భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గుండుమల, గుడిబండ, గోనెబావి, రొద్దం, డోన్, బేతంచర్ల మరియు తొండూరు ప్రాంతాల్లో నిర్మాణంలో నున్న బి.సి. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను త్వరితగతిని పూర్తి చేసి విద్యార్థులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. బీసీ, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేయబడుచున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు పర్చేందుకు టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఫిర్యాధులను స్వీకరించాలన్నారు. మెగా డిఎస్సీలో పోటీ పడే అభ్యర్థులకు సమర్థవంతమైన శిక్షణా కార్యక్రమాన్ని బి.సి.స్టడీ సర్కిళ్ల ద్వారా అందజేయాలని ఆదేశించారు. బి.సి. స్టడీ సర్కిళ్లలో శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు క్యాలెండర్ ను రూపొందించాలని ఆదేశించారు. బి.సి. కులవృత్తుల వారి పంపిణీకి ఉద్దేశింపబడిన



పనిముట్లు, పరికరాలు ఇంకా గోధాముల్లో ఉన్నట్లైతే వాటిపై సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారు. శాఖా పరంగా చేపట్టాల్సిన ప్రాధాన్యతా అంశాల అమలుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు పర్చాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరామ్, డైరెక్టర్ కృష్ణమోహన్, బి.సి.ఫైనాన్సు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన గుడివాడ ఎమ్మెల్యే

ఢిల్లీ, సూర్యా వాస్తవం: ఢిల్లీలోని ఆయన స్వగృహంలో వెంకయ్య నాయుడును మంగళవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య వద్ద రాము ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే రాముతో కొద్దిసేపు ముచ్చటించిన వెంకయ్య నాయుడు. గుడివాడ అభివృద్ధి కోసం, రూపొందించుకున్న ప్రణాళికలను వెంకయ్య నాయుడుకు రాము వివరించారు. చక్కటి విజన్‌తో ప్రజలకు సేవ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న రామును మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు అభినందించారు. ప్రజలకు మంచి చేసేలా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించాలని ఎమ్మెల్యే వెంకయ్య నాయుడు సూచించారు. రాజకీయాల్లో లెజెండ్



అయిన వెంకయ్య నాయుడు సూచనలు పాటిస్తూ ముందుకు వెళతాను అని రాము అన్నారు.పెద్దలు వెంకయ్య నాయుడు చెప్పిన ప్రతి మాట ఎంతో విలువైనది. రాజకీయాల్లో వెంకయ్య నాయుడు లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ప్రజా ప్రతినిధులంటే మరింత గౌరవం పెరిగేలా పనిచేస్తా. బూతులు మాట్లాడడం రాజకీయ కక్ష సాధింపు నాకనవసరం. గుడివాడ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం.... గుడివాడను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లడమే నా లక్ష్యం అని రాము పేర్కొన్నారు.

## స్పీకర్ కు జగన్ లేఖ... బహిరంగ లేఖతో బదులిచ్చిన బుద్ధా వెంకన్న

అమరావతి, జూన్ 25 (సూర్య వాస్తవం) :ఏపీ అసెంబ్లీలో తమకు విపక్ష హోదా ఎందుకివ్వరంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైసీపీ అధ్యక్షుడు జగన్ లేఖ రాయడం తెలిసిందే. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే ఉద్దేశం లేనందువల్లే... ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణం చేసిన తర్వాత తనతో ప్రమాణం చేయించారని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. జగన్ లేఖపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న ఘాటుగా స్పందించారు. జగన్ లేఖకు ఓ బహిరంగ లేఖతో బదులిచ్చారు. జగన్ మోహన్ రెడ్డీ... నాడు టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉంటే... నలుగురిని లాక్కుని, ఇంకో ఇద్దరిని కూడా లాక్కుందాం అని ప్రయత్నించి చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేద్దాం అనుకున్నది నువ్వు కాదా? అని బుద్ధా వెంకన్న సూటిగా ప్రశ్నించారు.

Truth of News
సూర్య
http://www.suryavastavam.com
వాస్తవం

అమరావతి
గుంటూరు, ఉమ్మడి కృష్ణా

# రాజభవనాల రక్షణ కోసం ఏకంగా ప్రత్యేక చట్టమా?

- జగన్ పై దేవినేని ఉమ ఫైర్ • కిమ్ ను మించిన పెత్తందారీ జగన్
- ఇంట్లో ఉంటేనే 986 మందితో సెక్యూరిటీ • బయటకు వెళితే అంతకు మూడు రెట్ల భద్రత

మైలవరం, సూర్యా వాస్తవం: కిమ్ ను తలదన్నే పెత్తందారీ వ్యవహార శైలి జగన్ రెడ్డిది, అంటూ టీడీపీ నేత దేవినేని ఉమ ఏపీ మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. తన రాజభవనాల రక్షణ కోసం ఏకంగా ప్రత్యేక చట్టమే చేశాడంటూ తీవ్రంగా విమర్శించారు. సొంత ప్యాలస్ ల రక్షణకు వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇంట్లో ఉన్నపుడు ఏకంగా 986 మందితో సెక్యూరిటీ పెట్టుకున్నాడని, బయటకు అడుగు పెడితే దానికి మూడు రెట్లు అధికంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నాడని ఆరోపించారు. దారిపొడవునా పరదాలు కప్పి, అడుగడుగుకో పోలీస్ ను





నిలబెట్టి రాష్ట్రంలో పర్యటించే వాడని తీవ్ర విమర్శలు చేశారు. తన కుటుంబం, తన రాజభవనాల రక్షణకోసం ప్రత్యేక చట్టం చేయడంతో పాటు తన నివాస పరిసరాల్లో 48 చెక్ పోస్టులు, రిక్ట్రాటబుల్ గేట్లు, బూమ్ బారియర్లు, టైర్ కిల్లర్లు, బోలార్డ్స్ లాంటి విస్తు గొలుపే అనవసర చర్యలు తీసుకున్నారని విమర్శించారు. తన తాడేపల్లి ప్యాలెస్ కు కూతవేటు దూరంలో జరిగిన అత్యాచారం, అరాచకాలను మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజల భద్రత గాలికి వదిలేసి వారి సొమ్ముతో విలాసాలు అనుభవించే నువ్వు పెత్తందారివి కాక మరేమిటి? అంటూ ఉమ విమర్శించారు.

# ప్రభుత్వ ఆకాంక్షల మేరకు సేవలందిద్దాం

**– రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి**

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించి.. రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనించేలా సమష్టిగా కృషిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు.ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. సంక్షేమం-అభివృద్ధి తారకమంత్రంగా తొలిరోజు నుంచి ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు 100 శాతం ప్రజలకు చేరువయ్యేలా చేయడం కోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వంలో భాగమైన వివిధ విభాగాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విధులను నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలను, పరిపాలన విధానాన్ని ఉద్యోగులందరూ ప్రత్యక్షంగా పరిశీలించారని గుర్తు చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఉద్యోగి సంతోషంగా విధులు నిర్వహించేలా, సంతృప్తికర స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వివిధ విభాగాల ఉద్యోగ సంఘాల నాయకులు కూడా తమ తమ సంఘాల సమావేశాల్లో ఇదే విషయాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రతి ఉద్యోగి భవిష్యత్తు తరాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అండగా నిలవాలన్నారు. ఒకవైపు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ మరోవైపు రాష్ట్రాన్ని సామాజికంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రగతి బాటలో పయనించేలా చేసి దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు సమష్టి కృషి అవసరమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంత్రి పార్థసారథిని కలిసిన వారిలో కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రమేష్ , కోశాధికారి వి. సతీష్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి దిలీప్, శివలీల, నగర శాఖ అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రాజశేఖర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ పి. మధుసూదన రావు, వైస్ ప్రెసిడెంట్ కేసర్ గణేష్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు అక్కిరాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, సహాధ్యక్షులు పి సాయిరాం తదితరులతోపాటు జేఏసీలో భాగమైన నాయకులు ఉన్నారు.

# దేశం మెచ్చేలా ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థకు సొబగులు

## ఉద్యోగుల సమస్యలు ఆసాంతం వింటూ... వాటిని నోట్ చేసుకున్న పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) : 'భారత దేశం మెచ్చేలా, జాతి మొత్తం ఆంధ్ర ప్రదేశ్ వైపు తిరిగి చూసేంత అద్భుతంగా రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేద్దాం... దీనికి నేను కంకణబద్ధుడినై పని చేస్తాను. నా ఒక్కడి వల్లనే ఈ మహా క్రతువు పూర్తి కాదు. ఉద్యోగుల సహకారం, సూచనలు నాకు చాలా అవసరం. దీనికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషిస్తారని బలంగా విశ్వసిస్తున్నాను' అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖామాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు పతనం అయ్యాయి అన్నారు. వాటిని తిరిగి గాడిలోపెట్టడం సాధారణ విషయం కాదు.. అయినా ప్రజలకు ఉపయోగపడేలా వ్యవస్థలకు మళ్లీ జీవంపోసేలా బలమైన సంకల్పంతో పని చేస్తానని ఉద్ఘాటించారు. మంగళవారం మంగళగిరిలోని పవన్ కళ్యాణ్ నివాసంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. శాఖల్లోని సమస్యలు, గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు, వారి పదోన్నతులు, ఇతర శాఖాపరమైన అంశాలను పూర్తిస్థాయిలో పవన్ కళ్యాణ్‌కి నివేదించి, వాటి వివరాలను ప్రత్యేకంగా తెలియజేశారు. వీటిని ఆసాంతం విన్న ఉపముఖ్యమంత్రివర్యులు వాటిని ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. వినతి పత్రాలను స్వీకరించిన అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని ఎంత తీవ్రంగా దెబ్బ తీశారనేది... వ్యవస్థలను ఎంత నాశనం చేశారనే విషయాలను, కీలక శాఖల్లోని వాస్తవాలను ప్రజల ముందుపెట్టేందుకు శాఖల వారీగా శ్వేత పత్రాలు విడుదల చేస్తాము. పంచాయతీరాజ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తాను. ఎంతో



ఇష్టంతోనే ఈ కీలకమైన శాఖలను తీసుకున్నాను. వ్యవస్థ మొత్తం అద్భుతంగా పని చేసేలా ముందుకు తీసుకెళ్తాను. సరైన నాయకత్వం లేకపోతే వ్యవస్థలు ఎలా నాశనం అవుతాయో గత ప్రభుత్వ పాలకులు ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. మళ్లీ వ్యవస్థలను గాడిలోపెట్టేందుకు, అవి పూర్తిగా ప్రజల కోసం పని చేసేలా తయారు చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేద్దాం. ఉద్యోగులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ, సాధక బాధకాలను అర్థం చేసుకుంటూ పునరుత్తేజం కలిగించేలా పాలన ఉంటుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన విధంగా 23 శాతం పీఆర్సీ జీతాల పెంపుదల చేయాలని, కొన్ని క్యాడర్ల సిబ్బందికి గ్రేడ్స్ ఫిక్సేషన్ పై ప్రభుత్వం పంపిన కమిటీ రిపోర్టు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు.

# రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో విత్తనాలు ఉంచాలి

అమరావతి,జూన్ 25 (సూర్య వాస్తవం) : ప్రత్యేక వ్యవసాయ కమీషనర్, ఆంధ్రప్రదేశ్ వారి కార్యాలయంలో వ్యవసాయశాఖామాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సంబంధిత కార్యాచరణ ప్రణాళిక అమలు తదితర పరిస్థితులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చేవూరు హరికిరణ్, ప్రత్యేక వ్యవసాయకమీషనర్, ఆంధ్రప్రదేశ్ వారు మంత్రివర్యుల వారికి స్వాగతం పలికారు. మంత్రివర్యులు



మొట్టమొదటసారిగా ఈ కార్యాలయానికి విచ్చేసిన సందర్భముగా సాదరంగా స్వాగతం తెలియచేస్తూ, వ్యవసాయ అనుబంధ శాఖ రాష్ట్ర అధిపతులు, ఉన్నతాధికారులను పరిచయం చేసారు. వ్యవసాయ ప్రత్యేక కమీషనర్ వారు ఖరీఫ్ పంట సీజన్ పరిస్థితులను, ప్రణాళికను వివరించారు. వ్యవసాయ శాఖ లోని క్యాడర్ సిబ్బంది ఖాళీల సంఖ్యను వివరించారు. రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతుల సంఖ్య, భూమి వివరాలు, సాధారణ వర్షపాత వివరములు, సాధారణ పంటల విస్తీర్ణం తదితర గణాంకాల వివరములు తెలియచేసారు. మంత్రివర్యుల వారు మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలం ప్రారంభమై కురుస్తున్న వర్షాలకు నారుమళ్ళు, విత్తనాలు నాటడం తదితర వ్యవసాయ పనులు సాగుతున్న దృష్ట్యా వ్యవసాయ శాఖ సిబ్బంది వారి సేవలను మరింత విస్తృతపరచి రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనపంపిణీ విధానము, అందుబాటులో ఉన్న విత్తనాలు, విత్తనప్రణాళికల అంశముపై మంత్రివర్యులు అడిగిన వాటికి వ్యవసాయ శాఖ ప్రత్యేక వ్యవసాయకమీషనర్ వారు సమాధానం తెలుపుతూ సబ్సిడీ విత్తనపంపిణీ "డి- కృషి యాప్" ద్వారా చేపడుతున్నామని, సకాలంలో తగు పరిమాణం లో వర్షపాతం నమోదుకావడం ద్వారా రాయలసీమ జిల్లాలలో పచ్చిరొట్ట విత్తనాలను ముఖ్యంగా పిల్లిపెసర , జనుము కావలసి ఉన్నదని, బడ్జెట్ అవసరం ఉన్నదని వివరించారు. ఈ విషయమై గౌరవ మంత్రివర్యులు స్పందిస్తూ రైతులకు ప్రభుత్వ సంస్థలకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిల కొరకు ప్రతిపాదనలను సిద్దం చేసి పంపవలసినదిగా తెలిపారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు కోరుకున్న అన్ని రకములవిత్తనాలు, ఎరువులు ఎటువంటి కొరత రాకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలు రైతుల గురించి ప్రస్తావిస్తూ ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతుల శ్రేయస్సు కోసం చాలా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నదనితెలియచేసారు. కౌలు రైతుల ఎంపిక, వాటి ఎంపిక మార్గదర్సకాలు సంబంధిత చట్టాలు పంపమన్నారు. ప్రధానమంత్రి వ్యవసాయ పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర కార్యక్రమాలపై జరిగిన చర్చాకార్యక్రమంలో తగు సూచనలిస్తూ సంస్థాగతంగా విధానాలపై మార్పులు చేసి, మరింత బలోపేతం చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యతనిస్తున్న మట్టినమూనాల సేకరణ, విశ్లేషణ మరియు అపరాల సాగు పంటలపై దృష్టి కేంద్రీకరించి ఉత్పత్తి పెంచాలని అధికారులను కోరారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిపై సీఐడీకి ఫిర్యాదు

అమరావతి, సూర్యా వాస్తవం: వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులపై సీఐడీకి ఫిర్యాదు అందింది. నెల్లూరు జిల్లాకు చెందిన గనుల యజమాని బద్రీనాథ్ సీఐడీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో గనులు దోచేశారని ఆరోపించారు. సజ్జల అనుచరులు శ్రీకాంత్రెడ్డి, ధనుంజరెడ్డి దౌర్జన్యం చేశారని.. దీనిపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించినట్లు బద్రీనాథ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.



## గ్రామాలలో ప్రజలకు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు వివరించిన బిజెపి నాయకులు



జగ్గయ్యపేట, సూర్యా వాస్తవం: ఎన్.టి.ఆర్.జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు మండలం లోని గ్రామాలలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ కార్డులు, ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ యోజన, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి గర్భిణీ స్త్రీలకు అందించే పోషక ఆహారాలు, మెడిసిన్స్, అనేక సంక్షేమ పథకాలు, వీటన్నిటిని గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమములో ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బుర్రా వెంకటరావు, జిల్లా ఓ.బీ.సీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కల్లూరు శ్రీవాణి, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు గణపవరపు అప్పారావు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు గింజుపల్లి ప్రసాదు మరియు మండల నాయకులు చింతా గోపాలరావు, తునికిపాటి రామాచారి, కర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొనినారు.

## రైతు భరోసా పథకం పేరు మార్పు

**–"అన్నదాత సుఖీభవ"గా మార్చడం జరిగింది.**

**–దానికి అనుగుణంగా వెబ్ సైట్ లో మార్పు.**




అమరావతి, సూర్యా వాస్తవం: అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పుడు 20,000 రూపాయలు ఆర్థిక సహాయం అందనుంది. ఇందులో కేంద్రం వాటా 6000 రూపాయలు, 14,000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందుతుంది. ఐతే గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో 13,500 రూపాయల ఆర్థిక సాయం రైతుకు అందించటం జరిగింది. కేంద్రం వాటా 6000 రూపాయలు, 7,500 వాటా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించటం జరిగేది.

## కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరందాలి - మంత్రి

మొదటి పేజీ తరువాయి

మంత్రి తన ఛాంబర్ లో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, సలహాదారులు ఎం.వెంకటేశ్వర రావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణ రెడ్డి లతో కలిసి శాఖకు సంబంధించిన ఉన్నత ఇంజనీరింగ్ అధికారులు, అన్ని జిల్లాల ఎస్ ఇ.లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టులు, కాలువలు, డ్రైన్లు, ఏటిగట్లు వంటి పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి అన్నారు. ఆనాడు ఎన్టీ రామారావు, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిపాలన సాగించా రన్నారు. ఆ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతాంగానికి మేలు జరగాలనే ఉద్దేశంతో బడ్జెట్ ఇబ్బందులు ఉన్నా ప్రత్యేక నిధులు ఇచ్చేందుకు సుముఖత తెలిపారన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎటువంటి కష్ట నష్టాలు ఎదురుకాకుండా పంట కాలువలు, మురుగు, డ్రైన్ల లో ప్రక్షాళన పనులు పది రోజుల్లోగా చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రధానంగా తూడు, గుర్రపు డెక్క, మట్టి తొలగింపు పనులు చేపట్టాలన్నారు. కాలువలు, డ్రైన్ల లో లాకులు, అవుట్ స్లూయిస్, షట్టర్ తలుపుల మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ఈ ఏడాది ఈ పనులు చేపట్టా లంటే ఏప్రిల్ నాటికి ప్రతిపాదనలు, మే నెలలో టెండర్లు ఖరారు వంటివి జరిగితే వేసవి లో పనులు జరిగి ఉండేవని, వీటిపై ఎందుకు దృష్టి పెట్టలేదని అధికారులను మంత్రి ప్రశ్నించారు.

## నిరవధిక సమ్మెలోకి జూడాలు




సికింద్రాబాద్ (సూర్య వాస్తవం) : గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను నిలిపి వేసి నిరవధిక స్ట్రైక్ లోకి దిగారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధికార ప్రతినిధి డా. అజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సమస్యలు పక్క రాష్ట్రంలో వలె ఇక్కడ కూడా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి రెగ్యులర్ గా స్టై ఫండ్ ఇవ్వాలన్నారు. ప్రతి ప్రభుత్వ దవాఖానలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ కల్పించాలని, ఉస్మానియా హాస్పిటల్ కు నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మా డిమాండ్లన్ని మా కోసం మాత్రమే కాదని ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసమేనని ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి బంధువులపై పాఠశాల యాజమాన్యం దాడి

రంగారెడ్డి (సూర్య వాస్తవం) : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మేధా హైస్కూల్లో గత శనివారం ఒక విద్యార్థి పాఠశాలలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్కు గురయ్యాడు ఆ విద్యార్థి ప్రస్తుతం హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు ఈ విషయమై స్కూల్ యాజమాన్యం స్పందించడం లేదని ఈరోజు విద్యార్థి సంఘాలు మరియు విద్యార్థి యొక్క కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకొని అక్కడ ధర్నా చేశారు ధర్నా చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్కూల్ వద్దకు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యంలో ఒక టీచర్ విద్యార్థుల యొక్క బంధువులపై దాడికి పాల్పడం వల్ల విద్యార్థి సంఘాలు మరియు బంధువులు ఆగ్రహానికి గురై పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## బేగంపేట్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు

సికింద్రాబాద్ (సూర్య వాస్తవం) : బేగంపేట్ ఎయిర్పోర్ట్ కు బాంబు బెదిరింపు వచ్చింది. బాంబు పెట్టినట్లుగా ఆగంతుకుల నుంచి మేయిల్ వచ్చినట్లుగా సమాచారం. అప్రమత్తమైన అధికారులు బేగంపేట్ ఎయిర్ పోర్ట్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయంతో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

## హైదరాబాద్ పాతబస్తీలో గందరగోళం

హైదరాబాద్ (సూర్య వాస్తవం) : సైదాబాద్ లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం ఎఉఖూఅ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామకాల కోసం నిర్వహించే పోటీ పరీక్ష 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది అయితే రెండున్నర గంటల తర్వాత కూడా పరీక్ష ప్రారంభం కాకపోవటంతో అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు దూరప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల తల్లిదండ్రులు, బంధువులు పరీక్షా కేంద్రం వెలుపల ఆందోళనకు వెళ్లారు వారికి మద్దతుగా ఆందోళనకు దిగిన బీజేపీ యువమోర్చా నాయకులు ధర్నా చేశారు. బీజేపీ యువమోర్చా నాయకులను సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. అయితే పరీక్ష ప్రారంభం కాకపోవడానికి సాంకేతిక సమస్య కారణంగా తెలుస్తుంది. టీజీపీఎస్సీ తరపున పరీక్ష నిర్వహించాల్సిన టిసిఎస్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా తెలుస్తుంది ఆన్లైన్ విధానంలో నిర్వహించాల్సిన పరీక్షకు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రంలో కంప్యూటర్లను సిద్ధం చేయాల్సి ఉంది. కానీ టిసిఎస్ వారు పరీక్ష నిర్వహించే సోమవారం ఉదయం కేంద్రానికి వచ్చి ఏర్పాట్లు వేయడం తో అవి పని చేయలేదు. అభ్యర్థుల ఆందోళన తెలుసుకున్న అధికారులు ఈ కేంద్రంలోని అభ్యర్థులకు పరీక్షను రీ షెడ్యూల్ చేశారు. ఈ మేరకు సంస్థ వెబ్సైట్లో సమాచారాన్ని పొందుపరిచారు.

## విద్య వెనుక వ్యాపారాలను అరికట్టండి

హైదరాబాద్ (సూర్య వాస్తవం) : రాష్ట్రం లో చాలా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అడ్డుగా పెట్టుకుని పలు వ్యాపారాలు చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్న ప్రైవేటు విద్యాశాలలో మొదలుకొని డిగ్రీల వరకు అనేక పాఠశాలలో కళాశాలాల్లో బూట్లు, సాక్సులు , వ్యాపారంతో పాఠ్యపుస్తకాలు వ్యాపారం, నోట్బుక్స్ వ్యాపారం నిరాటకంగా, ఎత్తేచగా పాఠశాలల్లో కళాశాలాల్లో నందే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అలాగే బిల్డింగులు నిర్మించుకున్నందువలన డొనేషన్లు విపరీతంగా వసూలు చేస్తున్నారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వము వీటిని నివారించడానికి కళాశాలల్లో నందు విద్య మాత్రమే బోధించేటట్లు ఎలాంటి వ్యాపారాలు లేకుండా కట్టడి చేసి పిల్లలకు న్యాయమైన విద్యను నేర్పించి వారి భవిష్యత్తులను బాధ్యత ప్రభుత్వం పైన కలదు. నేటి చదువుల కోసం లక్షలు వేచించి తర్వాత పెళ్లీడు వచ్చినప్పుడు పిల్లల తల్లిదండ్రులు ఇంటికి రాబోయే కోడళ్ల ద్వారా గుంజుతున్నారు. మా అబ్బాయి ఇంత అంత చదివాడని ఎదుటి ఆడపిల్లల మీద దుష్ప్రభావం పడుచున్నది. కట్నాలు చెల్లించలేని ఆడపిల్లల జీవితాలు సాగుతున్నది. కావున పాఠశాలలలో కళాశాలలో వ్యాపార పునాదులను దీని ప్రభావము ప్రతి ఒక్కరికి విద్యా అలాగే ఆడపిల్లల భవిష్యత్తు కూడా బాగుపడతాయని ప్రజలు కోరుకుంటున్నారు. నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం, పరిధిలో బ్రాహ్మణకొట్కూర్ గ్రామంలో విస్డం ప్రైవేట్ పాఠశాలలాల్లో ఇష్టానుసారంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారు. వారి పేరుతో పుస్తకాలు ముద్రించి స్కూల్ యూనిఫామ్, టై,బిల్టు,నోటు పుస్తకాలు అమ్ముతున్నారు. విద్యాశాఖ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.

# ఉపాధి హామీ పనిదినాలు పెరగడంపై కేంద్రం విస్మయం

న్యూఢిల్లీ (సూర్య వాస్తవం) : తెలంగాణలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మునుపెన్నడూ లేనిరీతిలో ఉపాధిహామీ పనిదినాలు పెరగడంపై కేంద్ర ప్రభుత్వం విస్మయం వ్యక్తం చేసింది. ఇందుకు గల కారణాలు తెలుపుతూ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. త్వరలో కేంద్ర బృందాలను తనిఖీకి పంపించాలని నిర్ణయించింది. ఏప్రిల్లో ఉపాధిహామీ పనులు రాష్ట్రంలో ప్రారంభమయ్యాయి. ఆ నెలతో పాటు మే, జూన్లలోనూ భారీగా పనిదినాలు నమోదయ్యాయి. ఏప్రిల్లో 19,89,740 మంది కూలీలకు 4,27,09,616 పనిదినాలు; మేలో 22,08,256 మందికి 4,29,91,467; జూన్లో ఈ నెల 20 వరకు, 10,86,155 మందికి 85,60,952 పనిదినాలు కల్పించినట్లు నమోదైంది. ఉపాధిహామీ కూలీలు, పనిదినాలు రోజువారీగా నమోదవుతాయి. వాటి ఆధారంగా కేంద్రం చెల్లింపులు చేస్తుంది. ఈ మేరకు ఈ నెల 20 వరకు నమోదైన పనిదినాల సంఖ్య పెరుగుదల అసాధారణంగా ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలో గణాంకాల నమోదు, ఎక్కువ మొత్తంలో కూలీలకు చెల్లింపులపై కేంద్రం ఆరా తీసింది. 2004 నుంచి ఇంతవరకు జరిగిన పనులను పరిశీలించింది. గత ఏడాది కంటే, జిల్లాల వారీగా, వరంగల్లో 232 శాతం, ములుగులో 231, కామారెడ్డిలో 229, ఖమ్మంలో 218, కరీంనగర్లో 217, సిద్దిపేటలో 200, పెద్దపల్లిలో 191, జోగులాంబ గద్వాలలో 187, రాజన్న సిరిసిల్లలో 181, మంచిర్యాలలో 180, హనుమకొండలో 178, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్లలో 169, జగిత్యాలలో 168, భద్రాద్రి కొత్తగూడెంలో 156, జనగామలో 155, మహబూబాబాద్, నిజామాబాద్లలో 151 శాతం చొప్పున పనిదినాలు పెరిగినట్లు నమోదైంది. ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి తాజాగా లేఖ రాసింది. కేంద్రం ఉపాధిహామీ కూలీల వేతనాలను పెంచిన నేపథ్యంలో తెలంగాణలో మునుపెన్నడూ లేనిరీతిలో పనిదినాలు నమోదయ్యాయని, గతంతో పోలిస్తే 18 జిల్లాల్లో పెరుగుదల శాతం ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నామని, ఇలా పనిదినాలు పెరగడానికి నిర్దిష్ట కారణాలను వెల్లడిస్తూ సమగ్ర నివేదికను కేంద్రానికి అత్యవసరంగా పంపించాలని ఎన్ఆర్ ఈజీఎస్ ఉప కార్యదర్శి ఆశీశ్ గుప్తా లేఖ రాశారు. దీంతోపాటు గత నెల 24న ఉపాధిహామీ పనుల తీరుపై తాము జారీచేసిన ఉత్తర్వులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని సూచించారు. ఈ మొత్తం అంశాలకు సంబంధించి నివేదిక అందిన తర్వాత కేంద్ర బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది.

కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు.. కేంద్రం లేఖపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ఆ 18 జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసింది. ఆయా జిల్లాల్లో పనిదినాలు పెరగడానికి నిర్దిష్ట కారణాలు తెలియజేయాలని సూచించింది. కేంద్ర బృందాలు వచ్చేనెల మొదటి వారంలో తనిఖీలకు వస్తున్నందున సంబంధిత రికార్డులను భద్రపరుచుకోవాలని ఆదేశించింది. ఆయా పనులకు సంబంధించి గ్రామసభల తీర్మానం, పనుల నిర్వహణకు నిరభ్యంతర పత్రం, పనులకు బోర్డులు, అంచనా వ్యయాలు, ఎంతమందికి పని కల్పించింది. పనిదినాలెన్ని. తదితర వివరాలతో పాటు పని ప్రారంభించడానికి ముందు, ముగిసిన తర్వాత తీసిన ఫొటోలను పంపించాలని ఆదేశించింది..

## మెగా జాబ్ మేళాకు భారీ స్పందన



హుస్నాబాద్ (సూర్య వాస్తవం) : యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హుస్నాబాద్లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఆకుల రజిత వైస్ చైర్మన్ అయిలేని అనిత, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆర్డీవో శ్రీరామమూర్తి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మెగా జాబ్ మేళ కి మంచి స్పందన వచ్చింది. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరయింది. దాదాపు 60 కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి.5000 ఉద్యోగాల నియామకం చేపట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. జాబ్ మేళా కి వచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి హెల్త్ క్యాంప్ లు, బోజన వసతులు ఏర్పాటు చేసారు. మంత్రి మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కు జీరో నుండి పీజీ వరకు హుస్నాబాద్ నియోజవర్గం నుండి ఆన్లైన్ లో అప్లై చేసుకున్న వారు 6 వేల మంది ఉన్నారు. హుస్నాబాద్ జీరో టూ పీజీ వరకు జాబ్ మేళా లో పాల్గొనడానికి వచ్చిన వారికి స్వాగతం.కు ఎక్కడ ఏ కంపనీ లో జాబ్ కావాలంటే అక్కడ ఇంటర్వ్యూ కి అటెండ్ కావాలి.తదుపరి జాబ్ మేళా మండల స్థాయిలో నిర్వహిస్తాం. జాబ్ మేళా కోసం వేలాది గా యువత తరలివచ్చారు. వారందరికీ మంచి అవకాశం. మీకు ఉన్న నైపుణ్యం తో కావాల్సిన ఉద్యోగం తో ఇక్కడి నుండి వెళ్ళాలని కోరుతున్న.ఇవే కాకుండా విదేశాల్లో కూడా నర్సింగ్ ,నిర్మాణ రంగం,ఇతర రంగాల్లో లక్షల్లో జీతాలు వచ్చే ఉద్యోగాలు ఉన్నాయి. మండలాల వారిగా ఇలాంటివి ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల వారికి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాత్రి 10 అయినా సరే ఇక్కడే ఉండి ఓపికగా ఇంటర్వ్యూ అటెండ్ కావాలి. హుస్నాబాద్ లో మొదటిసారి జాబ్ మేళా జరుగుతుంది. ప్రభుత్వం నుండి పకడ్బందీగా జాబ్ మేళా నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులకు దాదాపు ఉద్యోగాలు వచ్చేలా అవకాశాలు కల్పించాలి. ఇవే కాకుండా పాల ఉత్పత్తి, చేపల పెంపకం, గ్రామీణ పరిశ్రమలు కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి టూరిజం గా కూడా అభివృద్ధి చేస్తాం. ఎవరు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి. అందరూ మంచిగా ఇంటర్వ్యూ చేస్తూ ఉద్యోగాలు పొందే లెటర్ లతో పోవాలి. ఉద్యోగాలు పొందే యువతకు అందరికీ శుభాకాంక్షలని అన్నారు.

## అన్ని రంగాల్లో తొగటవీర క్షత్రియులు రాణించాలి

బద్వేలు (సూర్య వాస్తవం) : తొగటవీర క్షత్రియులు అన్ని రంగాల్లో రాణించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడపనగర శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లాలో తొగటవీర క్షత్రియుల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి కడప ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ప్రధమ, ద్వితీయ, తృతీయ,బహుమతులతో పాటు45మందికి నగదు పురస్కారాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన రంగంలో ఉన్న తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. నమ్మకం మనిషిని నడిపిస్తుందని ,ఇలాంటికార్యక్రమలు బతుకు గురుంచి ఆశ కల్పిస్తాయన్నారు .కడపలో కళ్యాణ మండపం, చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయాల నిర్మాణానికి పూర్తి సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తానని తెలిపారు. జీవితం ఒక పోరాటం అని, సంకల్పం ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. పిరికితనం వీడాలని చెప్పారు. సమస్యలను అధిగమిస్తూ పెద్దగా ఆలోచించాలని పేర్కొన్నారు. పేద కుటుంబంలో ఉన్న కులానికి ఏదో చేయాలని ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు అన్నిచోట్ల చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్ గురించి తెలియజేయాలన్నారు. మన కులంలో కార్లు ,బంగళాలు , పిక్స్ డిపాజిట్స్ కలిగినటువంటి స్థితిమంతులు చాలా అరుదుగా కనిపిస్తారని, అవేమీ లేవని నిరుత్సాహపడకుండా విద్య తోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటే అవన్నీ వాటంతట అవే వస్తాయన్నారు. ఆదిశగా క్రమశిక్షణ ,అంకితభావం, పట్టుదలతో విద్యనభ్యసించి సమాజానికి ,తల్లిదండ్రులకు సంఘానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడిన తర్వాత తల్లిదండ్రులను చూసుకోవడం బాధ్యతగా గుర్తెరగాలన్నారు.12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

## అనర్హుల రేషన్ కార్డులు పెన్షన్లు తొలగిస్తాం పొంగులేటి

హైదరాబాద్ (సూర్య వాస్తవం) : తెలంగాణలో అనర్హులు పొందుతున్న రేషన్ కార్డులు, పెన్షన్లను తొలగిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ పథకాల్లో పేద కుటుంబాలకే ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. జులై 1 నుంచి ఆగస్టు చివరిలోపు అర్హత కలిగిన ప్రతి రైతుకూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని అన్నారు.

## రెండు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని నల్ల రిబ్బన్లతో కన్వేయన్స్ డ్రైవర్లు నిరసన



మందమర్రి (సూర్య వాస్తవం) : మంచిర్యాల జిల్లా మందమర్రి డివిజన్ పరిధిలోని జియం ఆఫీసు, కెకె ఓసి, ఏరియా వర్క్ షాప్, కాసీపేట, కెకె 5,రెస్క్యు ఆఫీసు, ఆర్ కె పి ఓసి లల్లో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు 2 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వహించడం జరిగింది. కన్వేయన్స్ డ్రైవర్లకు 2 నెలలుగా వేతనాలు లేక ఆర్థికంగా కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. వేతనాల కోసం ఓనర్లను అడిగిన బిల్లులు అయితేనే ఇస్తామంటు నెలలు గడుపుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులతో సంబంధం లేకుండా కార్మికులకు ప్రతి నెలా 7వ తేదిన వేతనాలు ఇవ్వాలని యాజమాన్యం సర్క్యులర్ ఇచ్చిన ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి నెల వేతనాలు వచ్చిన పెరిగిన ధరలకు వచ్చే జీతం ఏ మూలకు సరిపోవడం లేదు. అలాంటిది నెలలు నెలలు రాకపోతే ఏలా ఆ కార్మికుడు, ఆ కార్మికుడి కుటుంబం ఏలా బతుకుతుందో అధికారులు ఆలోచించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న 2 నెలల వేతనాలను ఇప్పించాలి. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృ తం చేస్తామని హెచ్చరిస్తున్నాం. కార్యక్రమంలో మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు పాల్గొనడం జరిగింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పాం -మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ (సూర్య వాస్తవం) : కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ రైతులకు 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పామని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసారు. క్యాబినెట్లో ఆ నిర్ణయం తీసుకున్న సందర్భంగా తెలంగాణ రైతాంగానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. త్వరలోనే రుణమాఫీ పై జీవో, విధివిధానాలు వస్తాయి. త్వరలోనే మీరు తీసుకున్న రుణాలు మాఫీ అవుతాయి. భవిష్యత్ లో వ్యవసాయాన్ని పండగ లాగా చేసుకునే విధంగా ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుంది. రైతన్నలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనం. రైతు రుణమాఫీ మాట నిలుపుకున్న సందర్భంలో రైతులందరికీ నా యొక్క శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

వికారాబాద్ (సూర్య వాస్తవం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మొన్న జరిగిన టీఎస్ పిఎస్సి ముట్టడిలో యువమెర్చ నాయకులపైన పోలీసులు విచక్షణ రహితంగా గాయపర్చడం పై తెలంగాణ లోని ప్రతి జిల్లాలో కూడా సీఎం దిష్టి బొమ్మలు దహనం చేయడం జరుగుతుం దని అందులో బాగంగానే రోజు వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నిరుద్యోగులందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మరియు సిఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలండర్ విడుదల చేయలని వారు డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు చేయాల్సి వస్తుందని తెలిపారు.

## ఉస్మానియాలో జూడాల అందోళన

హైదరాబాద్ (సూర్య వాస్తవం) : తమ సమస్యల పరిష్కారం కోసం జూడాలు ఆందోళన బాట పట్టారు. విధులు బహిష్కరించి జూడాలు కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఆందోళనకు దిగారు. గత ఆరు నెలలుగా తమకు స్టైఫండ్ సరైన సమయానికి రావడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనం నిర్మించాలని ఆ రేళ్లుగా కోరుతున్నా... ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ లో స్థలం లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని... డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు ఉండటం లేదని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు కానీ హాస్టల్స్ పెంచడం లేదని... ఇరుకు గదులలో తాము ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని... తరుచు వైద్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా నూతన భవనం తో పాటు , తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి , పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం

నాగర్ కర్నూల్ (సూర్య వాస్తవం) : చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం వేలుగులోకి వచ్చింది. భూమి అమ్మడం లేదని 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్నను హత్య చేసిన విషయం ఇవాళ వెలుగు చూసింది . చెంచుల భూముల పై కొంత మంది గ్రామస్థులు కన్నేశారు. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో అతడిని హత్య చేశారు. శవ పరీక్ష నిర్వహించకుండానే అంత్యక్రియలు చేశారు. భూతగాదా నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు నాగన్న హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

# గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపిడిఓ ఉమా మహేశ్వర రావు



సిద్దవటం సూర్య వాస్తవం : గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఓ ఉమా మహేశ్వర రావు తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం ఎంపిడిఓ సభా భవనంలో మంగళవారం ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి సమస్యలు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో ఆయా గ్రామ పంచాయతీలలోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. సిద్దవటం సీహెచ్సీ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అతిసారా వల్ల మరణాలు సంభవించాయని, అతిసారా వ్యాధి ప్రబలుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అతిసారా లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్సీ లకు వెళ్లాలని డాక్టర్ సూచించారు. ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి 100 రోజుల్లో తేడా చూస్తారన్నారు. ప్రజలకు మంచి నీరు ఇవ్వండి. మౌళిక వసతులు కల్పించండి మండల పరిషత్ నుంచి నిధులు ఇస్తామన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలు తెలపాలని ప్రజలకు మెరుగైన పాలనను అందిస్తాం. ఎంపీపీ ప్రతినిధి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వెలుగుపల్లి లో మంచి నీటి సమస్య ఉన్నట్లు సార్వత్రిక ఎన్నికల సమయంలో తన దృష్టికి వచ్చిందన్నారు. మెటల్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి అభివృద్ధి పనుల్లో 10 రోజుల్లోనే తేడా చూపించండి. చేసే ఉద్యోగానికి న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఈఓపీఆర్డీ లక్ష్మి నరసయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

**– ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు**



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : అనంతపురం నగరంలో స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాబు మాట్లాడుతూ కాకినాడలో జులై 8 9 10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు రాజకీయాల పైన మరియు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదివే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యావ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని వెలికితీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థుల శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల దృష్టిని ఆలోచించి తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను ప్రస్తుతం అధికారంలోకి రావడంతో విద్యార్థుల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 5045 పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెన మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. కాకినాడలో జరుగుతున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థులు లోకానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణయ్య కుల్లాయి స్వామి జిల్లా కోశాధికారి హనుమంతు జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ యాదవ్ వెంకట్ నాయక్ ఆంజనేయులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ చట్టాలపై నేటి నుంచి చైతన్య సదస్సులు

**– ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి వెల్లడి**



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం ): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) అనుబంధ విభాగలైన డీసీపీ, ఐసీపీఎస్, చైల్డ్ లైన్, సీడబ్ల్యూసీ విభాగాల ఆధ్వర్యంలో అమలవుతున్న చట్టాలపై ప్రజల్లో చైతన్యం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి మంగళవారం తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే వాటికి సార్ధకత చేకూరుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ వినోద్ ఆదేశాలతో... జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో సదస్సుల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పీడీ శ్రీదేవి తెలిపారు. 26 నుంచి ఆగస్టు 14 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురానునట్లు పీడీ వెల్లడించారు. మొత్తం 8 మారుమూల ప్రాంతాల్లో ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందుకు సభంధించి సదస్సుల ఏర్పాటు బాధ్యతలు సిబ్బందికి అప్పగించారు. నేడు బొమ్మనహాల్ కస్తూర్బాలో.. బొమ్మనహాల్ లోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయంలో తొలి సదస్సుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. కిశోర బాలికలు, మహిళలు, గృహ హింస బాధితులు.. ఇలా వివిధ వర్గాల వారిని భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. పది అంశాలు ప్రమాణికంగా.. సదస్సుల ముఖ్య ఉద్దేశం పది అంశాలు ప్రామాణికంగా తీసుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ప్రణాళిక రచించినట్లు పీడీ శ్రీదేవి తెలిపారు. అందులో ప్రధానమైనవి.. 1. బాల్య వివాహాలు 2. వరకట్న నిషేధ చట్టం – 1961 3. పని చేసే చోట లైంగిక వేధింపులు 4. పొక్సో చట్టం – 2012 5. గృహ హింస నిరోధక చట్టం – 2005 6. చట్టబద్ధంగా పిల్లల దత్తత – 2022 7. ఆన్ లైన్ భద్రత 8. బహిష్టు సమయంలో పాటించాల్సిన శుభ్రత 9. జేజే చట్టం – 2015 10. డ్రగ్స్ దుర్వినియోగం. ఇలా పది అంశాలను తీసుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సంకల్పించినట్లు పీడీ ప్రకటించారు. సదస్సులు జరిగే ప్రదేశాలను ముందుగా ప్రకటిస్తామని ఆయా ప్రాంత ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు.

# కార్పోరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్



గుంతకల్లు ప్రతినిధి (సూర్య.వాస్తవం) : గుంతకల్లు నియోజకవర్గం లో ఉన్నట్టు ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని మరియు.గుత్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్న ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని గుత్తి తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకుడు చిన్న మాట్లాడుతూ పట్టణంలోని పలు కార్పోరేట్ విద్యాసంస్థలు విద్య పేరుతో అక్రమ వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బులు దండుకుంటున్నారన్నారు. అదేవిధంగా పలు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక భారీ స్థాయిలో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోని ప్రత్యేక గదులను కేటాయించుకుని పుస్తకాలను అధిక రేట్లకు అమ్ముతూ విద్యార్థులను ఖచ్చితంగా ఇక్కడే పుస్తకాలు కొనాలని పాఠశాల యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నారు. విద్యాశాఖ నిబంధన ప్రకారం పాఠశాలలో ఏ తరగతికి ఎంత ఫీజులు వసూలు చేస్తున్నారన్నది పాఠశాల నోటీసు బోర్డుపై ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే గుత్తిలో నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాలలు కూడా విద్యార్థుల తరగతుల ఫీజులను నోటీస్ బోర్డ్ పై పెట్టలేదు. దీంతో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమాచారాలతో పలుచోట్ల ఎంఈఓ దాడులు చేసి పుస్తకాలను సీజ్ చేసినప్పటికీ. కొంతమంది విద్యాసంస్థల నేతలు విద్యాశాఖ అధికారులకు మామూలు ఇస్తూ అధిక ఫీజుల వసూలు చేస్తున్న ఆరోపణలు కూడా తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి గుత్తి మండల వ్యాప్తంగా పాఠశాలలను తనిఖీ చేపట్టి అధిక ఫీజుల నుండి విద్యార్థుల తల్లిదండ్రులను రక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంతకలు నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్న,ఆనంద్, నరేష్,విజయ్ అలీ,నరసింహ,సునీల్ మనోహర్, రాము దేవా తదితరులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

## రాయలసీమ
### కడప, అనంతపురం, చిత్తూరు

# వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

**–వైఎస్ భారతి రెడ్డి**



సిద్దవటం సూర్య వాస్తవం : వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి, వైఎస్ భారతి రెడ్డిని భరోసా ఇచ్చినట్లు సిద్దవటం వైసీపీ నేతలు కనకాల నరసింహారావు, జ్యోతి సర్పంచ్ ప్రతినిధి రవిశంకర్ రెడ్డి లు తెలిపారు. పులివెందులలో వైఎస్ భారతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైర్య పడవద్దని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పిలుపు ఇచ్చినట్లు వారు తెలిపారు.

# అభివృద్ధి పనులకు స్థానిక సంస్థలు అడ్డంకి కారాదు: మాజీ డిప్యూటీ మేయర్



కడప, సూర్య వాస్తవం : మునిసిపల్ నగరాలలో కానీ, గ్రామాలలో కానీ కొన్ని అభివృద్ధి పనులు చెయ్యాలంటే వాటి తీర్మానాలు అవసరం అవుతాయి కావున స్థానిక సంస్థ లలో పాలకవర్గాలు ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉండడం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఉంటాయి కాబట్టి ఇటువంటి పరిస్థితులను రానివ్వకూడదు. కావున అభివృద్ధి జరగాలంటే స్థానిక సంస్థలు కూడా సహకరించాలని మాజీ డిప్యూటీ మేయర్ అన్నారు. మంగళవారం కడపలో విలేకరుల తో మాట్లాడుతూ గతంలో అప్రజాస్వామికంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినవి కాబట్టి అభివృద్ధి కి ఆటంకం కలగకూడదు కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకుని విచక్షణాధికారాన్ని ఉపయోగించి స్థానిక సంస్థల పాలకవర్గాలను రద్దు చేసి ఎన్నికలు నిర్వహించడం సమంజసంగా ఉంటుందని అరిపుల్లా అన్నారు.

# రెవిన్యూ సహాయకులకు రూ.500 బస్తా ఇవ్వాలి : సీఐటియూ



సిద్దవటం, సూర్య వాస్తవం : సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన రెవిన్యూ సహాయకులకు రోజుకు రూ.300 మాత్రమే ఇచ్చారని రూ.500 ఇవ్వాలని బస్తా ఇవ్వాలని సీఐటియూ అధ్యక్షుడు మనోహర్ సిద్దవటం తహశీల్దార్ మురా షావలికి వినతి పత్రం సమర్పించారు. సిద్దవటం మండలంలోని రెవిన్యూ సహాయ కులకు న్యాయం జరిగేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.

# పద్మశ్రీ విద్యా సేవలు మరువలేనివి

**–ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ**

పత్తికొండ (సూర్య వాస్తవం) : పత్తికొండ పట్టణంలో ఉన్న స్థానిక జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు పద్మశ్రీ పదవీ విరమణ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపధ్యాయురాలు భ్రమరాంబ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అయినా పద్మశ్రీ దంపతులను ఉపాధ్యాయిని బృందం మరియు వివిధ తరగతి విద్యార్థినిలు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ప్రధానోపాధ్యయరాలు భ్రమరాంబ మాట్లాడుతూ పద్మశ్రీ విద్యార్థులకు అందించిన విద్యాసేవలు మరువలేనివి అని వృత్తి పట్ల అంకిత భావం అమోఘం అపూర్వం అని కొనియాడారు. ఆమె ఎంతో మంది విద్యార్థులను తన ఉద్యోగ ప్రయాణంలో తీర్చిదిద్దారు అన్నారు. ఆమె ఎందరో ఉపాధ్యాయులకు ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



# మల్లికార్జున మరణం.. బాధాకరం : జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం క్రైం (సూర్య వాస్తవం) :గుండెపోటుతో మరణించిన జెడ్పీ ఉద్యోగి మల్లికార్జున మృతదేహాన్ని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ సందర్శించారు. మల్లి భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారని తెలియగానే వెంటనే ఆమె అనంతపురంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఘటన ఎలా జరిగిందని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ కు బయకుదేరిన మల్లికార్జున భార్య ఒడిలోనే ప్రాణాలొదిలినట్లు తెలుసుకొని గిరిజమ్మ దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన చాలా బాధాకరమని, తనను కలచివేసిందన్నారు. విధి నిర్వహణలో మల్లికార్జున అందరితో మంచిగా మెలిగేవారని పేర్కొన్నారు. తాము ఒక మంచి ఉద్యోగిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆమె భగవంతుడ్ని కోరుకున్నారు. ఆ తరువాత మల్లికార్జున కుటుంబ సభ్యులను గిరిజమ్మ ఓదార్చారు. అధైర్యపడొద్దు.. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్ పర్సన్



బోయ గిరిజమ్మ వెంట అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, జెడ్పీ సిబ్బంది ఉన్నారు.

# పార్టీ కోసం కష్టపడిన ముస్లిం మైనారిటీలను గుర్తించాలి

## సయ్యద్ మెహతాజ్ బేగం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి

రైల్వే కోడూరు, సూర్య వాస్తవం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం రైల్వే కోడూరు విలేకరులతో మాట్లాడుతూ ముందు నుండి తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ముస్లిం మైనారిటీలను సోషల్ మీడియా ద్వారా గుర్తించి వాళ్లకు తగిన బాధ్యతలను అప్పజెప్పాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ జెండా మోసేవాడు కరువైనప్పుడు పార్టీ జెండా పట్టుకుని పార్టీ కార్యక్రమాలకు చురుకుగా పాలుపంచుకొని తెలుగుదేశం పార్టీని ముస్లిం సమాజంలో తీసుకెళ్లిన ముస్లిం కార్యకర్తలను గుర్తించాలని అటువంటి వాళ్ళు పార్టీకి మూల స్తంభాలని ఆమె గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో పార్టీ అధికారంలోకి వచ్చిందంటే తెల్లని ఖద్దర్ చొక్కాలు వేసుకొని అసలు పార్టీ జెండా పట్టని వాడు కూడా మేము తెలుగుదేశం పార్టీ అని చెప్పుకొని ఇన్చార్జిల నాయకుల చుట్టూ తిరుగుతున్నారని అటువంటి వాళ్లను దూరం పెట్టాలని పార్టీ కోసం ఎవరైతే తమ శ్రమను చమటను సమయాన్ని వెచ్చించి కేసులు పెట్టించుకుని నలుగురితో మాటలు పడి చొక్కాలు చించుకొని పనిచేశారు. వాళ్ళని గుర్తించాలని ఆమె విన్నవించారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికలలో బిజెపితో పొత్తు పెట్టుకున్నా, ముస్లిం సమాజం నుండి తెలుగుదేశం పార్టీ ముస్లిం కార్యకర్తలకు చేదు అనుభవం ఎదురైనా కూడా కూడా పార్టీని నమ్ముకుని ఇన్ని రోజులు నారా చంద్రబాబు నాయుడు సిద్ధాంతాలను, సెక్యులర్ భావజాలాన్ని ముస్లిం మైనారిటీల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని ముస్లిం సమాజంలోకి తీసుకెళ్లిన ముస్లింలను తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేసే విధంగా పనిచేసిన ముస్లిం మహిళలు కానివ్వండి



పురుషులు కానివ్వండి వాళ్లని గుర్తించాలని అలాంటి వాళ్లే పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి స్తంభాలా నిలబడి ముస్లిం సమాజంలో పార్టీ విలువలను పెంపొందించే విధంగా పనిచేశారని ఆమె గుర్తు చేశారు. అందువల్లే గడిచిన ఎన్నికల్లో ముస్లిం సమాజం నుండి గంపగుత్తగా తెలుగుదేశం పార్టీ ఓట్లు పొందగలిగిందని ఆమె గుర్తు చేశారు. కావున నారా చంద్రబాబు నాయుడు అలాగే లోకేష్ అన్న నిజమైన కార్యకర్తలను గుర్తించి వాళ్లకు తగిన బాధ్యతలు అప్పజెప్పాలని తద్వారా ముస్లిం సమాజానికి మేలు చేసిన వారు అవుతారని ఆమె పేర్కొన్నారు.

# సాంకేతిక మార్పులతో లాభదాయకంగా వ్యవసాయ రంగం



తూర్పుగోదావరి (సూర్య వాస్తవం): పెద్ద ఎత్తున యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని అందించడానికి కసరత్తు చేస్తున్నట్లు ఐసి ఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యు ఎస్ గౌతమ్ చెప్పారు. ఇప్పటికే వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులతో లాభదాయకంగా వ్యవసాయ రంగం ఉండడంతో సాఫ్ట్ వేర్ నిపుణులు, గ్రాడుయేట్స్ కూడా వ్యవసాయ రంగంవైపు అడుగులు వేస్తున్నారని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి పరిధిగా గల కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికె) జోన్ 10వార్షిక జోనల్ సమీక్ష వర్క్ షాప్ రాజమహేంద్రవరం లో సిటీ ఆర్ ఐ లో ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్ షాప్ కి హాజరైన డా . గౌతమ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇంకా ఎక్కువమంది యువతను వ్యవసాయ రంగంవైపు ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో 731 కృషి విజ్ఞాన కేంద్రలు ఉన్నాయని, వీటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆధారం చేసుకుని వీటి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పరిశోధనలు, మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, మేలైన వంగడాలు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని మూడు జోన్స్ లో దాదాపు ఎనిమిది వేల హెక్టార్లలో ప్రయోగాత్మకంగా 300డ్రోన్స్ ఉపయోగించి పురుగుమందులు జల్లడం వంటి పనులకు సంబంధించి ప్రదర్శన ఇచ్చినట్లు డా గౌతమ్ చెప్పారు. దీనివలన కార్మికుల చార్జీలు తగ్గడం, కాలం సద్వినియోగం అవ్వడం, లాభదాయకంగా వ్యవసాయం ఉంటుందని తద్వారా యువత ఈ రంగంవైపు ఆకర్షితులవుతారని ఆయన అన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు

కాకినాడ (సూర్య వాస్తవం): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాస్థాయిలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) పై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఆర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు వంటి అంశాలపై ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ డీఆర్డీఏ, సీపీవో, మెప్మా, డీపీఎం డిజాస్టర్ మేనేజ్మెంట్, కెఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు, ఉపాధి శిక్షణ తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయిలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నమోదైన అర్జీల పరిష్కారానికి ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రత్యేక చర్యలు తిసుకుంటుందని ఆయన తెలిపారు. వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అధికారులకు తెలిపారు.

# కెసిఆర్ ప్రోద్బలంతోనే ఎమ్మెల్యేల చేరిక

హైదరాబాద్ జూన్ 25 (సూర్య వాస్తవం) : కేసీఆర్ కనుసన్నల్లోనే ఆ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపు జరుగుతున్నదని బీజేపీ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.పార్టీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కేసీఆరే కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలల్లో 11 సార్లు ఢిల్లీకి వెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు.సీఎం ఢిల్లీలోనే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని సెటైర్ వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా పాలనపై సీఎం రేవంత్? పట్టు సాధించలేదన్నారు. ఆరు నెలల కాలంలో మూకుమ్మడి బదిలీల పేరుతో ఐఏఎస్, ఐపీఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. బదిలీలతో అధికారులు శాఖలపై పట్టు సాధించలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు. హత్యలు, లైంగికదాడులు జరుగుతుంటే సమీక్షించే నాథుడే లేరన్ని ÷ర్? అయ్యారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం కొత్త ప్రయోగం చేస్తుందని విమర్శించారు.

# ఆదాయపన్నును మంత్రులే చెల్లించాలి

న్యూఢిల్లీ జూన్ 25 (సూర్య వాస్తవం) :మధ్యప్రదేశ్‌లోని భాజపా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మంత్రులు ఇకపై సొంతంగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందేనని సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తూ వస్తోంది. 1972 నుంచి ఈ నిబంధన అమల్లో ఉంది. మంత్రులకు చెల్లించే జీతం, ఇతర భత్యాలపై రాష్ట్ర ప్రభుత్వమే వారి తరఫున ఆదాయపు పన్ను చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో దాదాపు 52 ఏళ్ల తర్వాత ఈ నిబంధనకు కేబినెట్ చరమగీతం పాడింది. కేబినెట్ సమావేశంలో మంత్రి కైలాష్ విజయ వర్గీయ ఈ అంశాన్ని లేవనెత్తగా.. మంత్రులు సొంతంగానే ఆదాయపు పన్ను చెల్లించాలని సీఎం మోహన్ యాదవ్ సూచించారు. ఇందుకు కేబినెట్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మధ్యప్రదేశ్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులు సొంతంగానే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అస్సాంలోని హిమంత బిశ్వశర్మ సర్కారు నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే మధ్యప్రదేశ్ సర్కారు నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం.

## గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎమ్లు సేవలు

మొదటి పేజీ తరువాయి

ద్యను అభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకై ఏఎన్ఎమ్ లను డిప్యూట్ చేయడమే కాకుండా ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉండే ఈ విధానాన్ని గత ప్రభుత్వం నిలుపుదల చేసిన కారణంగా అనారోగ్యంతో, పోషకాహార లోపంతో పలువురు విద్యార్థులు మరణించడం జరిగిందన్నారు. గిరిజన పాఠశాలల్లో అటు వంటి మరణాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. గిరిజన పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో విద్యార్థుల స్టడీ అవర్స్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉండేందుకై త్వరలో నిర్వహించనున్న మెగా డిఎస్సీ ద్వారా 2,024 ఉపాధ్యాయులను గిరిజన పాఠశాలల్లో భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రత్యేకించి గిరిజన విద్యార్థినులు విద్యనభ్యసించే గిరిజన బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుందని, అంటెండర్లుగా కూడా మహిళలనే నియమించడం జరుగుతుందన్నారు. విద్యా బోధన, ఆహారం, భద్రత తదితర అంశాలపై ఫిర్యాదు చేసుకునేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేస్తామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచడమే కాకుండా ఇతర అధికారులతో ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపించి తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.తల్లీబిడ్డా ఎక్స్ ప్రెస్ సేవలను పునరుద్ధరిస్తామని, ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలను క్షేమంగా వారి ఇళ్లకు చేరుస్తామన్నారు. వాహనాల ద్వారా రేషన్ ను ఇంటి వద్దే పంపిణీ చేసే విధానం వల్ల గిరిజనులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవడం జరుగుచున్నదని, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో 962 రేషన్ డిపోలు ఉన్నాయని, ఆ డిపోల ద్వారానే రేషన్ పంపిణీ చేసే విధానాన్ని అనుమతించే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు.

## ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ని కలిసిన గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు




గుంతకల్లు ,సూర్య వాస్తవం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొణిదెల పవన్ కళ్యాణ్ ని మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసిన గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు. వాసగిరి మణికంఠ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వాసగిరి మణికంఠ. మాట్లాడుతూ వందకు వంద శాతం విజయంతో అసాధ్యాన్ని కూడా సాధ్యం చేసి, దేశ రాజకీయాల్లోనే కనీవినీ ఎరుగని చారిత్రాత్మక విజయం మీ సారథ్యంలో నమోదు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా. కూటమి విజయానికి చాలామంది జనసేన శ్రేణులు కష్టపడ్డారని వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని అలాగే గుంతకల్ నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ అతి త్వరలోనే పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని, అన్ని నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి అడుగులు వేస్తూ.గతంలో పార్టీ కోసం కష్టపడి. అవమానాలు పడి. నా కోసం నేనంటే ఉంటానంటూ నాయకులను కార్యకర్తలను పెట్టుకొని వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా చేస్తానన్నారు ఎందుకంటే మన పార్టీ కోసం కష్టపడిన వారిని గతంలో చాలామంది ఇష్టానుసారంగా మాట్లాడే అవమానాలు పరిచిన వారిని ఎప్పటికీ మరిచిపోను ఎంతమంది ఎన్ని అవమానాలు పెట్టినా మీరంటే నా వెనుక ఉన్నారు. నేను పదవులు అలంకరించానంటే, కేవలం నన్ను నమ్ముకున్న అభిమానులు కార్యకర్తలు మాత్రమే ఉన్నారు. వారి కోసం ఎంతటి త్యాగం చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నానని భరోసా కల్పించారు.

## మా ఎంపీలు పార్టీని వీడే అవకాశం లేదు

### -కడప ఎంపీ అవినాశ్ రెడ్డి



కడప బ్యూరో సూర్య వాస్తవం : వైసీపీ ఎంపీలు పార్టీ మారుతారంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన ఎంపీలు పార్టీ మారే అవకాశం లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు నీతులు చెబుతూనే వైసీపీ సానుభూతి పరులపై, నాయకులపై, కార్యకర్తలపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తాము ఎవరిపై దాడులు చేయలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరవయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## జిల్లా పేరు ను “వైఎస్ఆర్ కడప”జిల్లా గా మార్చాలి



ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): జిల్లా పేరులో కడప అనే పదాన్ని పునరుద్ధరించి, జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మార్పు చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హెూదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన సమితి సభ్యులతో కలిసి ఈ విషయమై ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కడప అనేది తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కి తొలి ప్రవేశ ద్వారం కాబట్టి, వేల సంవత్సరాల ఘనమైన చరిత్రని కాపాడవల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజల అందరి మీద ఉంది అని వివరించడం జరిగింది. జిల్లా ప్రజల యొక్క ఆకాంక్ష అని, విషయాన్ని ముఖ్యమంత్రికి దృష్టి కి తీసుకువచ్చి, జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లా గా మార్పు చెయ్యటానికి తన వంతు కృషి చేస్తానని శాసన సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మేశ్వర్ కుమార్, డాక్టర్ శంకర్ రెడ్డి, ప్రముఖ కవి జింకా సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## 29న జాతీయ లోక్ అదాలత్



తూర్పుగోదావరి (సూర్య వాస్తవం): తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రకాష్ బాబు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రెస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శికే .. ప్రకాష్ బాబు మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం తూర్పు గోదావరి జిల్లాలో కోర్టులో 29వ తేదీ నా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగలలో ఈ జాతీయ లోక్ అదాలత్ నందు, కోర్టులలో పెండింగ్ లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు మరియు ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించబడితుందాని, కక్షిదారులందరు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకుని జిల్లా వ్యాప్తంగా జరుగు జాతీయ లోక్ అదాలత్ తమ యొక్క కేసులను పరిష్కరించుకొనవలసినదిగా తెలియజేసారు.

# సినిమా


## అందం ఈ కోమలికి కట్టు బానిస..

### వయసు పెరిగిన వదిలి పోనంటుంది..



సదా అనే స్క్రీన్ నేమ్ తో గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారి అసలు పేరు సదాఫ్ మహమ్మద్ సయ్యద్. ప్రధానంగా తెలుగు, తమిళం మరియు కన్నడ చిత్రాలలో కనిపించే భారతీయ నటి. 'జయం' సినిమాలో నితిన్ సరసన నటించి మెప్పించింది అందాల భామ సదా.. తొలి సినిమాతోనే భారీ విజయం అందుకుంది. వెళ్లవయ్యా.. వెళ్లు.. వెళ్లూ అంటూ లంగా ఓణిలో మెరుస్తూ ఈ అమ్మడు చెప్పిన డైలాగ్ కుర్రాళ్లకు బాగా కనెక్ట్ అయ్యింది. తమిళ్ లో విక్రమ్ సరసన 'అపరిచితుడు' సినిమాలో నటించింది. ఈ సినిమా బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్‌గా నిలిచింది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉన్న ఈ సీనియర్ హీరోయిన్ రీసెంట్ గా పలు టీవీ షోల్లో కనిపిస్తూ ఆకట్టుకుంటుంది సదా. సోషల్ మీడియాలో మాత్రం ఈ సీనియర్ హీరోయిన్ చాలా యాక్టివ్ గా గడిపేస్తుంది. కొత్త కొత్త ఫొటోలతో కవ్విస్తుంది. వయసు పెరుతుతున్నా తరగని అందంతో ఆకట్టుకుంటుంది సదా. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను వదిలింది. ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.. వైట్ కలర్ డ్రస్ లో అదరగొట్టింది ఈ సీనియర్ బ్యూటీ.. ఈ అమ్మడి ఫోటోలకు కుర్రకారు కొంటె కామెంట్స్ చేస్తున్నారు. సదా నన్ను పెళ్లి చేసుకోవా.. అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశాడు.

## ఊహించని నష్టం.. ఆస్తులు అమ్ముకుంటున్న రకుల్ భర్త



స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలీవుడ్ నిర్మాత , నటుడు జాకీ భగ్నానిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గతకొంతకాలంగా ప్రేమలో ఉన్న ఈ ఇద్దరూ.. ఇటీవలే పెళ్లి చేసుకొని కొత్త జీవితం మొదలు పెట్టారు. హిందీ చిత్ర పరిశ్రమలో పెద్ద నిర్మాత అయిన జాకీ భగ్నానీతో చేతులు కలిపి రకుల్ ప్రీత్ సింగ్ జీవితం సెటిల్ అయిందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు ఊహించని విధంగా జాకీ భగ్నాని కుటుంబం కష్టాల్లో కూరుకుపోయింది. 250 కోట్ల అప్పుల్లో కూరుకుపోయాడు జాకీ భగ్నాని. దీంతో జాకీ భగ్నానీ తన ఆస్తిలని అమ్ముకుంటున్నాడని తెలుస్తోంది. జాకీ భగ్నానీ తన సంస్థలో పనిచేస్తున్న చాలా మంది ఉద్యోగులకు చాలా నెలలుగా జీతం చెల్లించలేదు. అతని మొత్తం అప్పు 250 కోట్ల రూపాయలకు చేరుకుంది. అందుకే 'పూజా ఎంటర్‌టైన్‌మెంట్' ఆఫీస్ ఉన్న భవనాన్ని అమ్మేశాడు. 7 అంతస్తులతో కూడిన భవనం అమ్మేశాడు జాకీ. భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తారని అంటున్నారు..పూజా ఎంటర్‌టైన్‌మెంట్' భారీ నష్టాలను చవిచూడడంతో 80 శాతం మంది ఉద్యోగులను తొలగించారని తెలుస్తోంది. దాదాపుగా ఉద్యోగులెవ్వరికీ డబ్బులు ఇవ్వలేదని చెబుతున్నారు. దాంతో కొందరు ఈ సంస్థ, నిర్మాతలు జాకీ భగ్నాని, వాషు భగ్నానిపై సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు బాలీవుడ్ లో ఇదే హాట్ టాపిక్ గా మారింది.

## అచ్చుగుద్దినట్టు అలనాటి హీరోయిన్ లా ఎట్రాక్ట్ చేస్తున్న సంయుక్త..



టాలీవుడ్ ఇండస్ట్రీలో గోల్డెన్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది హీరోయిన్ సంయుక్త మీనన్. తెలుగులో ఈ ముద్దుగుమ్మ నటించిన చిత్రాలన్ని బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. మొదటిగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భీమ్లా నాయక్ మూవీతో సెకండ్ హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయమైంది సంయుక్త. ప్రస్తుతం వరుసగా విజయాలను అందుకుంటూ తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీకి మాత్రం మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు. ఆఫర్స్ రాలేదా ? లేదా అవకాశాలను వదిలేసుకుంటుందా ? అనేది మాత్రం తెలియరాలేదు. చివరిసారిగా నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన డెవిల్ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత మరో సినిమా చేయలేదు. కానీ మలయాళంలో వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ బిజీగా ఉంటుంది సంయుక్త.యూత్‌లో ఈమెకు మస్త్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. ఇదిలా అంటే.. తాజాగా ఈ వయ్యారిభామ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట బాగా వైరలవుతుంది. బ్లాక్ అండ్ వైట్లో యూత్ ని బాగా అట్రాక్ట్ చేస్తుంది ఈ సొగసరి.

# ఆరోగ్యం

## నిద్రకు ముందు ఈ చిన్న పని చేస్తే.. మందుల అవసరమే ఉండదు



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో సమస్యలు మనల్ని వెంటాడుతున్నాయి.. అందుకే, ఆరోగ్యంగా ఉండేందుకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని.. జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇలాంటి సమయంలో నడక ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఈ నడక ఎప్పుడు ఎలా చేయాలో తెలుసుకుందాం. సాధారణంగా చాలామంది ఉదయాన్నే వాకింగ్ చేస్తుంటారు. ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో సమస్యలు మనల్ని వెంటాడుతున్నాయి.. అందుకే, ఆరోగ్యంగా ఉండేందుకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని.. జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇలాంటి సమయంలో నడక ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఈ నడక ఎప్పుడు ఎలా చేయాలో తెలుసుకుందాం. సాధారణంగా చాలామంది ఉదయాన్నే వాకింగ్ చేస్తుంటారు. ఇది చాలా మంచిది. అయితే రాత్రి పడుకునే ముందు కూడా వాకింగ్ చేస్తే మరిన్ని ఆరోగ్య ప్రయోజననాలు పొందవచ్చుంటున్నారు నిపుణులు. అది మీ ఆరోగ్యంపై చాలా ప్రభావం చూపుతుంది. నిద్రలేమితో బాధపడే వారికి రాత్రి భోజనం తర్వాత చేసే వాకింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. నిద్రపోయే ముందు తేలికపాటి నడక శరీర ఉష్ణోగ్రతను కొద్దిగా తగ్గిస్తుంది. ఇది మంచి నిద్రకు చాలా అవసరం.. దీనివల్ల మనసుకు ప్రశాంతతతోపాటు హాయిగా నిద్ర పడుతుంది.

## ఉదయాన్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు వేసుకుని తాగితే ఏమవుతుందో..?



ఇలా తాగడం వల్ల మొటిమలు, సోరియాసిస్, తామర లక్షణాలు తగ్గుతాయి. గోరువెచ్చని నీటిలో ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరంలోని విషపదార్థాలు విడుదలవు తాయి. తద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. అంతేకాకుండా, ఉప్పు నీరు మూత్రపిండాలు, కాలేయాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడానికి మీరు రోజూ ఉప్పునీరు తాగవచ్చు.శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, బాడీలో టాక్సిన్స్‌ను బయటకు పంపడానికి ప్రతిరోజూ తగినంత నీరు తాగడం మంచిది. దీని వల్ల శరీరంలోని మురికి కూడా సులువుగా బయటకు వస్తుంది. అలాగే, ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిని తాగడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ఉదయాన్నే తాగే గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు కలిపితే ఎన్ని లాభాలో తెలిస్తే ఆశ్చర్యపోతారు. పరగడుపునే గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి తాగటం వల్ల అనేక వ్యాధులకు దివ్యౌషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. గోరువెచ్చని నీటిని ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. ఈ నీటిలో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు లభిస్తాయి. ఇది శరీరంలో సరైన ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి సహాయపడుతుంది. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఉప్పునీరు చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇందులో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నిత్యం నీటిలో ఉప్పు కలిపి తాగితే కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. మీకు మలబద్ధకం సమస్య ఉంటే, ఉప్పు నీరు ఔషధంగా పని చేస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగు కదలికలు సులభతరం అవుతాయి. ఇది మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది కడుపు స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. గోరువెచ్చటి నీటిలో ఉప్పు కలిపిన నీరు చర్మానికి చాలా మేలు చేస్తుంది. ఉప్పునీరు తాగడం ద్వారా మీరు అనేక చర్మ సంబంధిత సమస్యలను కూడా నివారించవచ్చు. ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి సహాయపడుతుంది. దీన్ని తాగడం వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. అంతేకాకుండా, ఉప్పునీరు మూత్రపిండాలు, కాలేయాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడానికి మీరు రోజూ ఉప్పునీరు తాగవచ్చు.



# క్రీడలు

## అంతర్జాతీయ క్రికెట్‌కు డేవిడ్ వార్నర్ గుడ్‌బై




ప్రముఖ ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇప్పటికే టెస్టు, వన్డే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన వార్నర్.. తాజాగా టీ20ల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. పొట్టి ప్రపంచకప్ టోర్నీ నుంచి ఆసీస్ నిష్క్రమించిన తరుణంలో డేవిడ్ రిటైర్మెంట్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ టీ20 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిది కావొచ్చని డేవిడ్ గతంలోనే చెప్పాడు. ఇప్పటి వరకు 110 అంతర్జాతీయ టీ20లు ఆడిన వార్నర్ ఒక శతకం, 28 అర్ధశతకాలతో 3277 పరుగులు సాధించాడు. 2019లో పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌లో శతకం బాదాడు. మొత్తం మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన మూడో ఆసీస్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. డేవిడ్ వార్నర్‌కు ఐపీఎల్ టోర్నీ మంచి పేరు తెచ్చిపెట్టింది. 2021లోనే టీ20 లీగ్స్‌లో 10,000 పరుగులు పూర్తి చేసుకున్న బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

## తాలిబన్లను మెప్పించి.. తలరాతకు ఎదురీది.. అఫ్గాన్ క్రికెట్ ప్రయాణం..

క్రికెట్ అంటే శరణార్థి శిబిరాల గుడారాల వద్ద ఆడుకొనే ఆటగా వారికి పరిచయమైంది.. మెల్లగా అది వారి మనసు దోచుకొంది. తిరిగి స్వదేశానికి వెళ్లే సమయంలో దానిని కూడా తమతో తీసుకెళ్లారు. అక్కడి మతఛాందస పాలకులను ఒప్పించారు.. పట్టుదలగా ప్రతి ఒక్కటి నేర్చుకొన్నారు.. తరాలు మారే కొద్దీ అక్కడి ఆట తలరాత మారిపోయింది. క్రికెట్ లో చిన్న చేపగా భావించిన అఫ్గాన్ జట్టు అనూహ్యంగా పెరిగి పెద్దదై సొరచేపగా మారి.. అగ్రశ్రేణి జట్ల విజయావకాశాలను తినేస్తోంది. ఈ పొట్టి ప్రపంచకప్‌లో ఆసీస్, న్యూజిలాండ్ వంటి మెగా జట్లను ఓడించింది. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి ఆత్మవిశ్వాసంతో సెమీస్‌లోకి అడుగుపెట్టింది. తన విజయాలేవీ అదృష్టంతో వచ్చినవి కాదని నిరూపించింది. 1980ల్లో సోవియట్ ఆక్రమణతో అందమైన అఫ్గానిస్థాన్ ఛిన్నాభిన్నమైంది. లక్షల మంది ప్రజలు పొరుగునున్న పాకిస్థాన్‌కు పారిపోయి పెషావర్ వంటి నగర శివార్లలో శరణార్థి శిబిరాల్లో తలదాచుకొన్నారు. అక్కడ వారికి క్రికెట్ పరిచయం అయింది. యుద్ధం ముగిశాక తాలిబన్ల పాలన మొదలైంది. శరణార్థి శిబిరాల్లో ఉన్నవారు ఆ ఆటను కూడా తమతోపాటు అఫ్గానిస్థాన్‌కు తీసుకెళ్లారు. 1995లో క్రికెట్ బోర్డును ఏర్పాటు చేశారు. తొలుత మిగిలిన ఆటల వలే దీనిపై తాలిబన్లు నిషేధం విధించారు. కానీ, కొన్నాళ్లకు ప్రజల్లో దీనికి ఉన్న ఆదరణ.. అభ్యంతరకరం కాని వస్త్రధారణ ఉండటంతో నిషేధం తొలగించారు. 2001లో తొలిసారి జాతీయ జట్టును తయారు చేశారు. నాటి నుంచి అక్కడ క్రికెట్‌పై ప్రేమ పెరుగుతోందే తప్ప తగ్గలేదు. 2009లో వన్డే హోదా, 2013లో ఐసీసీ అసోసియేట్ సభ్యత్వం, 2017లో టెస్ట్ హోదా లభించాయి.వాస్తవానికి 2019లో తాలిబన్లు తిరిగి రెండోసారి అధికారంలోకి వచ్చే నాటికి ఈ జట్టు 'అఫ్గాన్ రిపబ్లిక్' గుర్తు, జాతీయ గీతంతో అంతర్జాతీయ క్రికెట్ ఆడేది. దేశంలో తిరుగుబాటు తర్వాత పరిస్థితి మారింది. కానీ, ఈ జట్టు పాత జెండా, జాతీయ గీతంతోనే అంతర్జాతీయ మ్యాచ్ లు ఆడేందుకు తాలిబన్లు అనుమతించారు. తమ జట్టులో ప్రతిభను గమనించి వారు గతేడాది 1.2 మిలియన్ డాలర్ల నగదు సమకూర్చడం విశేషం. ఇప్పుడు అఫ్గాన్‌లోని 34 ప్రావిన్సుల్లో 5 వేల క్రికెట్ క్లబ్బులున్నాయి. ఒక్క ఖోస్ట్‌లోనే 110 జట్లు తయారయ్యాయి. ఏటా జూన్–అక్టోబర్ వరకు క్లబ్ క్రికెట్ జరుగుతుంది. ఆ తర్వాత గ్రేడ్–2 ఆటకు సెలక్షన్, జనవరి సీజన్‌లో గ్రేడ్–1కు ఎంపికలు ఉంటాయి. మెల్లగా దేశీయంగా శిక్షణ సౌకర్యాలను సమకూర్చుకొంటున్నాయి. అఫ్గానీలు మిగిలిన ఫార్మాట్ల కంటే టీ20నే అత్యధికంగా ఆడతారు. అఫ్గానిస్థాన్ క్రికెటర్ల లో నేర్చుకోవాలనే తపన చాలా ఎక్కువగా ఉంటుందని గతంలో కోచ్‌లుగా పనిచేసిన వారు వెల్లడించారు. మైదానంలో 30 నిమిషాలు పరిగెత్తమంటే.. వారు కనీసం గంట సేపు రన్నింగ్ చేస్తారని ఆ జట్టు మాజీ కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్ ఓ సందర్భంలో గుర్తు చేసుకొన్నారు. శిక్షణ విషయంలో వారు అస్సలు వెనక్కి తగ్గరని పేర్కొన్నాడు. యుద్ధం తీవ్ర స్థాయిలో ఉన్న రోజుల్లో కొన్ని సందర్భాల్లో ఆటగాళ్లు తమ ఆత్మీయుల అంత్యక్రియలకు వెళ్లి కూడా శిక్షణకు వచ్చేవారని అసిస్టెంట్ కోచ్ రయిస్ అహ్మద్‌జాయ్ పేర్కొన్నాడు. చాలా మంది ఆటగాళ్ల వద్ద ట్యాక్సీకి డబ్బులు లేకపోవడంతో ఎయిర్ పోర్టు నుంచి ఇళ్లకు నడుచుకొంటూ వెళ్లారంటే వారి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చు.










IRS PUBLICATIONS, 13-2-819-2, RAMBO RESIDENCE, RTC BUS STAND ROAD, SRINIVAS NAGAR, ANANTAPUR ANANTAPUR, ANDHRA PRADESH, 515001 GSTIN: 37AAJFI5233N1ZY TEL:7672042522 - EDITOR : M. IRSHAD BAIG - CELL - 918500425222.